క్లుప్తంగా

నేడు ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

చాపాడు : మండలంలోని ఖాదర్‌పల్లె గ్రామ సచివాలయ పరిధిలోని నాగులపల్లెలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ గ్రామంలోని ప్రజలకు వైద్య పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ఇదే క్రమంలో ఇళ్లకే పరిమితమైన దీర్ఘకాలిక రోగులను పరీక్షించి అవసరమైన మందులను పంపిణీ చేస్తామని తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

ప్రొద్దుటూరు : స్థానిక ఆర్టీసీ డిపోలో సోమవారం వేకువజామున ఆర్టీసీ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ డిపో అధ్యక్షుడు డి.గోపాల్ మాట్లాడుతూ ఏపీ జేఏసీ అమరావతి ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. డిపో కార్యదర్శి బీసీ శేఖర్, జోనల్ ట్రెజరర్ పీఎన్‌పీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసలు దోషులను శిక్షించాలని వినతి

ప్రొద్దుటూరు : కమలాపురం మండలం పందిళ్లపల్లె పరిధిలో 11కేవీ స్తంభాలు అక్రమంగా తీసి మరో చోట నిర్మించిన సంఘనపై సమగ్ర విచారణ జరిపి అసలు దోషులను శిక్షించాలని ఏఐటీయూసీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు, ఏపీ ఎలక్ట్రిసిటి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివయ్య, రీజనల్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ సోమవారం స్థానిక విద్యుత్ ఈఈ శ్రీనివాసులు రెడ్డిని కలిసి వినతిపత్రమిచ్చారు. సంబంధం లేకున్నా ఏఎల్ఎం విజయశేఖర్‌కు మెమో ఇచ్చారన్నారు.

నేడు మార్కెట్‌కు వేలం

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ హాల్‌లో మంగళవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ మైదానంలోని తాత్కాలిక కూరగాయల మార్కెట్, వాహనాల పార్కింగ్, మాంసం, చేపల మార్కెట్‌కు రుసుం వసూలుకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్చు పాటదారులు 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు రుసుం వసూలు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు.

ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ పోటీల్లో ప్రతిభ


ఆకేపాటి శంకరరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రాయలసీమ వ్యాయామ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ ఆకేపాటి శంకరరెడ్డి ఆల్‌ఇండియా సీనియర్స్ టెన్నిస్ పోటీలలో 55 ఏళ్ల వయసు విభాగంలో విజేతగా నిలిచారు. భీమవరంలోని కాస్మోక్లబ్‌లో ఆల్ ఇండియా సీనియర్స్ టెన్నిస్ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన పోటీలలో ప్రతిభ కనపరచి ప్రథమ స్థానంలో నిలిచారు. శంకర్‌రెడ్డిని రాయలసీమ వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవిశంకర్, యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

మతసామరస్యం పాటించాలి


మాట్లాడుతున్న వన్‌టౌన్ సీఐ రాజారెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : ప్రతి ఒక్కరూ మతసామరస్యాన్ని పాటించాలని సీఐలు తెలిపారు. స్థానిక త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సాయంత్రం సబ్‌డివిజన్ స్థాయి పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ ప్రొద్దుటూరు పట్టణం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. ఇక్కడ దసరా, రంజాన్, క్రిస్మస్‌తో పాటు షాహంసేన్‌వలి దర్గా ఉరుసు, రామేశ్వరం తిరునాళ్లను భక్తిశ్రద్ధలతో, ఎతో వైభవంగా జరుపుకుంటారన్నారు. రానున్న రంజాన్, శ్రీరామనవమి పండుగలను కూడా భక్తిభావంతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు రాజారెడ్డి, ఇబ్రహీం, నారాయణయాదవ్, ఎస్ఐలు కృష్ణంరాజునాయక్, మైనుద్దిన్, మత పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

మొక్కలు విరివిగా పెంచాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : మొక్కలను విరివిగా పెంచి పర్యావరణాన్ని కాపాడాలని రాణీ తిరుమల దేవి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మీనాపురం గ్రామంలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్‌లో భాగంగా సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశ్వర్‌రెడ్డి, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

బస్సును తప్పించబోయి కారు బోల్తా

చాపాడు: ప్రొద్దుటూరు – మైదుకూరు జాతీయ రహదారిలోని చాపాడు మండలం నాగులపల్లె సమీపంలో సోమవారం కడపకు సర్వీసింగ్‌కు వెళుతున్న కారు ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ప్రమాదంలో ప్రొద్దుటూరుకు చెందిన వస్త్ర వ్యాపారి రమణ గాయపడ్డారు. ఇటీవల కారు కొనుగోలు చేసిన రమణ తొలి సర్వీసింగ్ కోసం కడపకు వెళుతుండగా ముందు వెళుతున్న బస్సును తప్పించబోయి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది.

మా నమ్మకం మహిళామణులే

వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నమ్మకం మహిళామణులేనని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి తెలిపారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత కార్యక్రమంలో భాగంగా సోమవారం అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు నుంచి 13వ వార్డు వరకు డ్వాక్రా మహిళలతో సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు అన్నింటా పెద్ద పీట వేసిందని తెలిపారు. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని మహిళలను వంచించారన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి జగన్ డ్వాక్రా రుణాలను విడతల వారిగా మాఫీ చేస్తున్నారన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గానికి సంబంధించి సుమారు రూ.150 కోట్లు డ్వాక్రా రుణాల మాఫీ జరుగుతోందన్నారు. జగనన్న అమ్మ ఒడి ద్వారా తల్లులకు ఏటా రూ.15వేలు ఇవ్వడంతో పాటు అర్హులైన వారందరికి ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. మీ ఓటు ఎంతో విలువైనదని, శక్తివంతమైనదని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ రంగస్వామి, మున్సిపల్ కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, వై.జయంతి, గుర్రం లావణ్య, రాగుల శాంతి, మన్నే సత్యం, గరిశపాటి లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల ద్వారా సత్వర సేవలు

పెద్దశెట్టిపల్లె సచివాలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


సచివాలయ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు సత్వర సేవలు అందించడం జరుగుతోందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరు మండల పరిధిలోని పెద్దశెట్టిపల్లె గ్రామంలో రూ.40లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అటు గ్రామాల్లో, ఇటు పట్టణాల్లో సచివాలయాల పరిధిలోని వలంటీర్లు ఇళ్ల వద్దకే వచ్చి ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బయపురెడ్డి పార్వతమ్మ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బోరెడ్డి పార్వతమ్మ, వైస్ చైర్మన్ బండి ఆత్మకూరు సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, కొత్తపేట జయరామిరెడ్డి, ప్రొద్దుటూరు మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ బయపురెడ్డి పార్వతమ్మ తన సొంత నిధులు రూ.10లక్షలతో నిర్మించిన పెద్దశెట్టిపల్లె ఈద్గా ప్రహరీ నిర్మాణాన్ని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఎంతో ఔదార్యంతో పార్వతమ్మ ప్రహరీ నిర్మాణానికి డబ్బులు ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామంలోని ముస్లింలు ఎన్నటికీ ఆమె సేవలను మరచిపోలేరన్నారు. స్థానికులు షరీఫ్, సాధిక్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ బండి ఆత్మకూరు సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి పంటలు సాగు చేయండి


మహిళా రైతుకు కిట్‌ను అందిస్తున్న డీపీఎం రామకృష్ణరాజు, శాస్త్రవేత్తలు

మైదుకూరు : ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ కింద ప్రకృతి పంటలు సాగు చేసి పొలాలను పచ్చదనంతో నింపాలని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పి.రామకృష్ణరాజు అన్నారు. మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం రైతులకు పీఎండీఎస్ (ప్రీమాన్సూన్ డ్రై సోయింగ్) కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 365 రోజులు ప్రత్యేకమైన పద్ధతులతో ప్రకృతి వ్యవసాయ విధానాన్ని అనుసరించి పంటలను సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే అధిపతి, విస్తర్ణ విభాగం శాస్త్రవేత్త శ్రీవిద్యారాణి, శాస్త్రవేత్తలు ఎం.హర్షిత్, ఎస్.ఫిరోజ్ హుస్సేన్, టీఎస్ కాంతిశ్రీ, పీఐఏఎఫ్‌పీఓ రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎడ్యుకేషన్ కిట్లు పంపిణీ


విద్యా ఉపకరణాలతో విద్యార్థులు

మైదుకూరు : మైదుకూరులోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు సోమవారం భారతీయ స్టేట్ బ్యాంకు అనుబంధ సబ్‌కే లియే – సబ్‌కే సాథ్ వారు ఎడ్యుకేషన్ కిట్లను పంపిణీ చేశారు. పాఠశాలలోని 93 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, కంపాక్స్‌లు, వాటర్ బాటిళ్లను అందజేశారు. అదేవిధంగా పొదుపు చేసుకునేందుకు ముందుకు వచ్చిన విద్యార్థులకు జీరో అకౌంట్ కింద బ్యాంకు ఖాతాలను తెరిపించారు. విద్యార్థి దశలోనే పొదుపు చేయడం మంచి అలవాటని ఈ సందర్భంగా సబ్‌కే లియే – సబ్‌కే సాథ్ సీనియర్ సీఆర్‌ఓ టి.శివకిశోర్ అన్నారు. డి.శ్రీనివాసరెడ్డి, ఎస్‌జీఎం బాషా నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామ్సన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి


ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు

ప్రొద్దుటూరు : గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా రోజూ పోషకాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టులోని సూపర్‌వైజర్ జి.కళావతి తెలిపారు. మహేంద్ర నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం కిశోర బాలికలకు క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. చౌడూరు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడాపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎన్.ఈశ్వరమ్మ, ఏఎన్ఎం సులోచనమ్మ, మహిళా పోలీసు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలి

రాజుపాళెం : గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు బలవర్ధకమైన పోషకాహారాన్ని తీసుకోవాలని పశుసంవర్ధకశాఖ ఏడీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. రాజుపాళెం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రం –3లో సోమవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి, వీఏఏ సుమలత, ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేసుకోవాలి

చాపాడు : ఖరీఫ్ –2022లో సాగు చేసిన పసుపు రైతులు తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలని ప్రభుత్వ ఉద్యాన శాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ –2022 సంవత్సరంలో పసుపు సాగు చేసిన ప్రతి రైతు ఈ–క్రాప్‌లో పంట నమోదు చేసుకుని, ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని తెలిపారు. నమోదు చేసుకున్న రైతులకు సీఎం యాప్ ద్వారా కొనుగోలు షెడ్యూల్ ఇవ్వడం జరుగుతుందన్నారు. వీరి ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తుందని వివరించారు.

రాజకీయ కక్షతోనే రాహుల్ గాంధీపై అనర్హత వేటు

పోరుమామిళ్ల : కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీపై అనర్హత వేటు కేవలం బీజేపీ రాజకీయ కక్షతోనే వేసిందని ఏఐసీసీ సభ్యురాలు కమలమ్మ, పీసీసీ కార్యదర్శి ప్రభాకర్ ఆరోపించారు. సోమవారం వారు ఇక్కడ మాట్లాడుతూ అదానీతో ప్రధాని మోడీకి ఉన్న సంబంధంపై రాహుల్ పదే పదే ప్రస్తావించడం తట్టుకోలేని బీజేపీ ఈ నిర్ణయం తీసుకుందన్నారు. న్యాయస్థానం పైకోర్టుకు వెళ్లేందుకు అవకాశమిచ్చిందని, పైకోర్టులో తీర్పు వచ్చే వరకు ఆగకుండా అనర్హతకు నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. దేశ ప్రజలు బీజేపీ పాలన గమనించాలని వారు కోరారు.

ప్రొద్దుటూరు క్రైం: రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వంపై అనర్హత వేటు వేయడం అప్రజాస్వామిక చర్య అని ప్రొద్దుటూరు కాంగ్రెస్ ఇన్‌చార్జి పీఎండీ నజీర్ తెలిపారు. అనర్హత నిర్ణయాన్ని నిరసిస్తూ సోమవారం గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. బీజేపీ కక్ష పూరితమైన రాజకీయాలకు అంతే లేదన్నారు. ఆర్.విజయకుమార్‌బాబు, భాస్కర్, రామాంజనేయులు తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజుపాళెం: రాజుపాళెం సబ్ స్టేషన్ పరిధిలోని రాజుపాళెం, కొర్రపాడు, అర్కటవేముల, సోమాపురం, వెంగళాయపల్లె, పర్లపాడు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ


గోపవరం: మహిళకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

గోపవరం : ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు అని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బేతాయపల్లె సచివాలయం పరిధిలోని బేతాయపల్లె, దిన్నెమీదపల్లె, రాజుపేట గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా సచివాలయంలో అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వివిధ పనులపై సచివాలయానికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. అనంతరం గడప గడపకు వెళ్లి నాలుగేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలుకు ఏ మేర లబ్ధి చేకూరిందో బుక్‌లెట్ ద్వారా చదివి వినిపిస్తూ వారికి తెలియజేశారు. ఇంకా అర్హత ఉండి సంక్షేమ పథకాలు రాని వారు ఎవరైనా ఉన్నారా అని ఎమ్మెల్యే ఆరా తీశారు. సమస్యలు ఏవైనా ఉన్నాయా అని అడుగగా గ్రామ పంచాయతీ కేంద్రమైన బేతాయపల్లెలో డ్రైనేజీ సమస్య ఉందని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి 2024లో తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడేలా ప్రతి ఒక్కరూ ఆదరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోపవరం మల్లికార్జునరెడ్డి, సచివాలయ కన్వీనర్ పుల్లయ్య, సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీటీసీ సరస్వతమ్మ, మార్కెట్ యార్డు డైరెక్టర్ వెంకటసుబ్బారెడ్డి, జిల్లా జాయింట్ సెక్రటరీ సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.రమణారెడ్డి, నరసింహారెడ్డి, వెంకటేష్, వెంకటరమణ, అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ రామనవమికి ముస్తాబైన ఆలయాలు

పోరుమామిళ్ల : శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని వైష్ణవాలయాలు ముఖ్యంగా శ్రీరాముడి దేవస్థానాలు ముస్తాబయ్యాయి. మరో భద్రాద్రిగా పిలవబడుతున్న చల్లగిరిగెల శ్రీ పట్టాభి రామస్వామి ఆలయంలో గత 30 సంవత్సరాలుగా నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం కూడా ఉగాది నుంచి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తుల కోసం ప్రతిరోజు సాయంత్రం స్వామికి వివిధ అలంకారాలు చేస్తున్నారు. సోమవారం శ్రీకృష్ణావతార అలంకారం చేశారు. మంగళవారం మోహినీదేవి అలంకారం, బుధవారం వేంకటేశ్వరస్వామి అలంకారం, గురువారం శ్రీరామావతార అలంకారం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 30తేదీ గురువారం ఉదయం 10 గంటల నుంచి శ్రీ సీతారాముల కల్యాణం, మధ్యాహ్నం నటరాజ కులుకు భజన, సాయంత్రం బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోరుమామిళ్ల టీటీడీ కల్యాణ మండపం సమీపంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో, పట్టణంలోని శ్రీరామనగర్‌లోని దేవస్థానంలో ఉదయం పదిన్నర గంటల నుంచి శ్రీ సీతారాముల కల్యాణం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం గ్రామోత్సవం, భజనలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం అన్నదానం జరుగుతుందన్నారు.

ఉద్యోగులంతా ప్రభుత్వం వెంటే

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి


కాకర్ల వెంకటరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

కలసపాడు : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులంతా ప్రభుత్వం వెంటే ఉన్నారని నూతనంగా ఎన్నికైన పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం కలసపాడులో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఇటీవల ప్రలోభాలకు గురిచేసి ఎమ్మెల్యేలను కొని ఎమ్మెల్సీ పదవులను గెలుచుకున్నాడని, ప్రజలు, ఉద్యోగులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట ఉన్నారని ఆయన తెలిపారు. అనంతరం మండలంలోని బ్రాహ్మణపల్లెలో ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డి తండ్రి కాకర్ల వెంకటరెడ్డి పెద్దకర్మలో ఆయన పాల్గొని వెంకట్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, కె.మాధవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు సూదా రామకృష్ణారెడ్డి, ఎంపీపీ నారాయణయాదవ్, మాజీ జెడ్పీటీసీ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ


ఓరియంటల్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్: మండల పరిధిలోని 19 ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు సోమవారం ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అట్ట, పెన్నులు పంపిణీ చేశారు. సెయింట్ జోసఫ్ పాఠశాలలో 1996లో పదవ తరగతి చదివిన విద్యార్థుల సహకారంతోవీటిని అందించినట్లు సంస్థ అధ్యక్షుడు సత్యనారాయణ తెలిపారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్‌బీసీసీ జిల్లా కో ఆర్డినేటర్ కెతుర, సంస్థ గౌరవ సలహాదారుడు సివి.సుబ్బారావు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, మాధవ, శివకృష్ణ, శంకరాచారి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భూములు పంపిణీ చేయాలి


నిరసన వ్యక్తం చేస్తున్న మాలమహానాడు నాయకులు

ప్రొద్దుటూరు : అసైన్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేసి జిల్లాలోని దళిత, బడుగు, బలహీన వర్గాల వారికి భూములు పంపిణీ చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు రామాజి ఇమ్మానుయేల్ తెలిపారు. సోమవారం స్థానిక మైదుకూరు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామాజి ఇమ్మానుయేల్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన భూ కబ్జాలపై విచారణ జరిపి, సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. రెవెన్యూ అధికారులు, సబ్ రిజిస్ట్రార్లు దళారులు ఇచ్చే డబ్బులకు ఆశపడి ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మనోహర్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు జి.వెంకటరమణ, మురళీప్రసాద్, చిన్న ఓబన్న, ఏసురత్నం, అరుణ్‌కుమార్, కిరణ్‌కుమార్, ప్రసాద్, చంద్రశేఖర్, గోకుల సుధాకర్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



హాజరైన స్వయం సహాయక సంఘాల సభ్యులు, మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, పక్కనే ఎమ్మెల్యే డాక్టర్ సుధ

అట్లూరు : మహిళా సాధికారతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డాక్టరు సుధ పేర్కొన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయ ఆవరణలో మూడవ విడత వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు పాలనలోకి వచ్చిన వెంటనే స్వయం సహాయక సంఘాల రుణాలు అప్పటికీ ఉన్న మేర నాలుగు విడతల్లో వారివారి అకౌంట్లలోకే జమ చేస్తామని చెప్పి మూడవ విడతను అందిస్తున్నామన్నారు. అట్లూరు మండలంలో 512 స్వయం సహాయక సంఘాలకు రూ.2.65 కోట్లను మూడవ విడత ద్వారా ఆయా సంఘాల మహిళలకు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంఘం చైర్మన్ ఆర్.మాధవరెడ్డి, అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లికార్జునరెడ్డి, ఏరియా కో–ఆర్డినేటర్ వెంకటసుబ్బారెడ్డి, ఎంపీపీ పొత్తపి రమాదేవి, వైస్ ఎంపీపీ సుబ్బారెడ్డి, సచివాలయాల మండల కన్వీనరు మణ్యం మల్లికార్జునరెడ్డి, అందూరు రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీ చిన్నగంగయ్య, కంభగిరి, వరికుంట, అట్లూరు సర్పంచులు గంగమ్మ, రమణయ్య, రేణుకా యల్లమ్మ, మండల సమాఖ్య అధ్యక్షురాలు రెడ్డెమ్మ, పోతిరెడ్డి రెడ్డెయ్య, డీలర్ కృష్ణారెడ్డి, ఏపీఎం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

పేదల ఆరోగ్యం పదిలంగా ఉండాలని మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు పేర్కొన్నారు. అట్లూరు మండలానికి మంజూరైన నూతన 104 వాహనాన్ని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు జెండా ఊపి సోమవారం ప్రారంభించారు.

నేడు గోపవరంలో..

గోపవరం: వైఎస్సార్ ఆసరా మూడవ విడత నిధులకు సంబంధించిన చెక్కును మంగళవారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధల చేతుల మీదుగా డ్వాక్రా మహిళలకు అందించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోపవరం మల్లికార్జునరెడ్డి తెలిపారు. బద్వేలులోని రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల ఆవరణలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, డ్వాక్రా సంఘాల మహిళలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ప్రతిష్ఠ మహోత్సవంలో..

బద్వేలు అర్బన్ : పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయనగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం జరిగిన స్ఫటిక శివలింగ ప్రతిష్ఠలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వాంగ సుందరంగా నిర్మించిన ఆలయంలో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 27 అంగుళాల స్ఫటిక శివలింగాన్ని ఏర్పాటు చేయడాన్ని అభినందించారు. తొలుత ఆలయ నిర్వాహకులు రామసబోయిన మురళి, కౌన్సిలర్ దుద్దుకూరి సత్యనారాయణలు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు ఘనస్వాగతం పలికారు. పూజా కార్యక్రమం అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, జెడ్పీటీసీ చిన్న పోలిరెడ్డి, రూరల్ నాయకులు పోలిరెడ్డి, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు ప్రతాప్‌కుమార్, బుజ్జి, అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.